# పండుగలా ప్రచారం

## అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికెళ్లి వివరిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులు

- మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే అండగా ఉంటామని ప్రజలకు భరోసా
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై వాడవాడలా చర్చ
- పార్టీలోకి కొనసాగుతున్న వలసల పర్వం

రంగారెడ్డి, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : గులాబీ పార్టీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో జోరు పెంచారు. ఓ వైపు పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవాలు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహిస్తూనే మరోవైపు గ్రామాల్లో ముమ్మరంగా పర్యటిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దని.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలకు వివరిస్తున్నారు. మళ్లీ ఆశీర్వదిస్తే అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు. డప్పు కళాకారుల ప్రదర్శనలు..ర్యాలీలతో ప్రచారం హోరెత్తుతున్నది. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై వాడవాడలా విస్తృతస్థాయిలో చర్చ జరుగుతున్నది. అన్నివర్గాల వారిని సంతృప్తి పరిచేలా ఉందని ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నది. కుల సంఘాలు, కాలనీల అసోసియేషన్ల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తుండగా బీఆర్ఎస్ పార్టీలోకి వలసల పర్వం సైతం మరింత ఊపందుకున్నది.

### బైక్ ర్యాలీలు.. కళాకారుల ప్రదర్శనలతో..

సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీ ఫామ్‌లు అందుకున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో మరింత జోరు పెంచారు. బైక్ ర్యాలీలు, డప్పు కళాకారుల ప్రదర్శనలతో ప్రచారం హోరెత్తుతున్నది. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సోమవారం అన్మాస్‌పల్లిలో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. జమ్మలబాయితండా, పూల్లేరుబోడు తండా, పోచమ్మగడ్డ తండా, గానుగుమర్ల తండా, కానుగుబాయితండాల్లో విస్తృతంగా పర్యటించి కడ్తాల్‌లో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను సబ్బండ వర్ణాలకు వివరించారు. కేశంపేట మండలంలో ప్రచారం చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు అపూర్వ స్వాగతం లభించింది. బైర్ఖాన్‌పల్లిలో డప్పు కళాకారుల నృత్య ప్రదర్శన మధ్య ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యాచారంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ ప్రారంభించారు. అనంతరం యాచారంలో నిర్వహించిన బూత్ కమిటీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొని బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.



షాద్‌నగర్ : బైర్ఖాన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో డప్పు కళాకారుల ప్రదర్శన

### అటు మద్దతు..ఇటు చేరికలు

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు కుల సంఘాలు, కాలనీల అసోసియేషన్ల మద్దతు వెల్లువెత్తుతున్నది. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 51 కాలనీల అసోసియేషన్ల సభ్యులు మంత్రి సబితా ఇంద్రారెడ్డికి మద్దతు పలుకుతూ మంత్రికి లేఖను అందజేశారు. సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని రావిర్యాలలో 30 మంది బీజేపీ ముఖ్యకార్యకర్తలు, మంఖాల్ గ్రామంలో బీజేపీకి చెందిన మాజీ వార్డు సభ్యులు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షులు వారి వారి అనుచరులతో మంత్రి సబితాఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ కండువాలు కప్పుకున్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 12వ వార్డు పరిధిలోని ఇంద్రానగర్‌కాలనీకి చెందిన 100 మంది బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. శంకర్‌పల్లి మండలంలోని బుల్కాపూర్ గ్రామానికి చెందిన 100 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే కాలె యాదయ్య సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

### వాడవాడలా మ్యానిఫెస్టోపై చర్చ..

సీఎం ప్రకటించిన మ్యానిఫెస్టోపై వాడవాడలా చర్చ జరుగుతున్నది. ఇప్పటివరకు చేపట్టిన సంక్షేమానికి కొనసాగింపుగా మరికొన్ని కొత్త సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ అధినేత మ్యానిఫెస్టోలో చేయడాన్ని సబ్బండ వర్ణాలు స్వాగతిస్తున్నాయి. పేద కుటుంబాలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తామనడం, తెల్లకార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ రూ.5లక్షల బీమా అమలు చేస్తామనడంపై పేద వర్గాలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లు, రైతుబంధు సాయాన్ని పెంచుతామని పేర్కొనడంపై ఆయా వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. అర్హులైన మహిళలకు ప్రతి నెలా రూ.3 వేల చొప్పున భృతి, పేద మహిళలకు రూ.400కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ కింద వైద్యపరిమితిని రూ.15లక్షలకు పెం చడం వంటి వరాలతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. మ్యానిఫెస్టో అన్నివర్గాల వారిని సంతృప్తి పరిచేలా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



చేవెళ్లలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ



శివమారుతిగీతా అయ్యప్ప ఆలయంలో గాయత్రీదేవిగా..



కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పార్వతీదేవిగా అమ్మవారు

# గాయత్రీదేవిగా అమ్మవారు

- వైభవంగా సాగుతున్న దేవీ నవరాత్రులు
- ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 16: దేవీ నవరాత్రోత్సవాలు షాద్‌నగర్ పట్టణంలో వైభవంగా సాగుతున్నాయి. పట్టణంలోని శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలో సోమవారం అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు పార్వతీదేవి అవతారంలో.. పెద్ద జానమ్మపేట లక్ష్మీవేంకటేశ్వరాలయంలో బాలాత్రిపురాసుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

### కొనసాగుతున్న దసరా నవరాత్రులు

చేవెళ్లటౌన్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారు సోమవారం ప్రత్యేక పూజలు అందుకున్నారు. మండలకేంద్రంలోని రచ్చబండవద్ద ప్రతిష్ఠించిన అమ్మవారికి భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజు అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు.

### గాయత్రీదేవిగా భవానీమాత

షాద్‌నగర్‌రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట అంబాభవానీ ఆలయంలో భవానీమాతను సోమవారం గాయత్రీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు రారు. పూజలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, ఎలికట్ట సర్పంచ్ సాయిప్రసాద్, ఆలయ చైర్మన్ కృష్ణయ్య పాల్గొన్నారు.

**కొత్తూరు :** అమ్మవారి కృప అందరిపై ఉండాలని ప్రార్థించినట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవేందర్‌యాదవ్ అన్నారు. ఆయ న కొత్తూరు మున్సిపాలిటీ పాత కార్యాలయం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



కొత్తూరు : అమ్మవారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- రంగారెడ్డి కలెక్టర్ భారతిహోలికేరీ
- కలెక్టరేట్‌లో మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ప్రారంభం

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 16 : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని రూం నంబర్–15లో మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్‌ను జిల్లా ఎన్నికల అధికారి, రంగారెడ్డి కలెక్టర్ భారతిహోలికేరీ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ముందస్తు అనుమతి లేకుండా ప్రసారం చేసిన ప్రకటనలను సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు, పార్టీల ప్రకటనలకు వంటివి సకాలంలో ఆమోదిస్తూ మంజూరు చేయాలని సూచించారు. శాటిలైట్ చానళ్లలో వచ్చే వార్తలను పూర్తి స్థాయిలో రికార్డు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వార్తపత్రికలు, ఈ– పేపర్లు, టెలివిజన్ చానళ్లు, స్థానిక కేబుల్ నెట్‌వర్క్, సోషల్‌మీడియా, ఇతర ఆడియో, వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసీఎంసీ సెల్ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాతే విడుదల చేయాలని కలెక్టర్ సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించిన పోస్టులపై చట్టప్రకారం చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, జిల్లా అధికారులు పద్మశ్రీ, నర్సింహ, బాలేశ్వరి తదితరులున్నారు.




కలెక్టరేట్‌లో మీడియా గ్యాలరీని ప్రారంభిస్తున్న కలెక్టర్ భారతి

### డీఆర్సీ సెంటర్ పరిశీలన

ఎన్నికల ప్రక్రియలో భాగంగా రంగారెడ్డి కలెక్టర్ భారతి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాలకు సంబంధించి ఇబ్రహీంపట్నం సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డీఆర్సీ సెంటర్‌ను సోమవారం పరిశీలించారు. సాధారణ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామగ్రి పంపిణీ, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూం వంటి వాటికి అనుగుణంగా ఉన్న కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రవాణా, పార్కింగ్ వసతులతోపాటు భద్రతాపరమైన అంశాలను పరిశీలించారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్, స్ట్రాంగ్‌రూంలకు అనువైన భవనాలు, గదులను పరిశీలించారు. వారి వెంట కందుకూరు, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి ఆర్డీవోలు, డీసీపీ శ్రీనివాస్, సంబంధిత అధికారులున్నారు.

# పొరపాట్లు లేకుండా విధులు నిర్వహించాలి

## వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 16 : త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నియోజకవర్గ, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పోలింగ్ రోజు ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని.. ఎన్నికల సిబ్బందికి రిటర్నింగ్ అధికారుల ద్వారా పోలింగ్ మెటీరియల్‌ను అందించాలన్నారు. రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఈవో రేణుకాదేవి, వికారాబాద్ ఎంపీడీవో సత్తయ్య, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి